క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మురళీధర్

పాలకొండ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందిచుకోవాలని సీఐ మురళీధర్ అన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 7న చలో విజయవాడ


చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ రూరల్: రైతుల సమస్యలపై ఆగస్టు 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. మండలంలోని కొండాపురంలో సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు తెలంగాణా రాష్ట్రంలో మాదిరిగా రూ.10 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కౌలు రైతు సమస్యల పరిష్కారం, 50 ఏళ్లు దాటిన అన్నదాతలకు రూ.10 వేల పింఛను అందించాలని, ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన ఆహార, వాణిజ్య, ఉద్యానవన పంటకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.రామూర్తినాయుడు, బలగ లక్ష్మునాయుడు, పిట్ట రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా యాంటీలార్వల్ ఆపరేషన్


మాట్లాడుతున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహనరావు

సీతంపేట: యాంటీలార్వా ఆపరేషన్ పకడ్బందీగా చేపట్టాలని మలేరియా నివారణ విభాగం సబ్‌యూనిట్ జె.మోహనరావు అన్నారు. దోనుబాయి, కిల్లాడ, పుబ్బాడ, పెద్దపొల్ల, టిటుకుపాయి సచివాలయాల పరిధిలో మంగళవారం యాంటీ లార్వల్ ఆపరేషన్‌పై గ్రామ సచివాలయ, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో క్లోరినేషన్, ఫాగింగ్, శానిటేషన్ పనులపై పలు సూచనలు చేశారు. మలేరియా, డెంగీ, డయేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కురుపాం: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు దశలవారి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పేస్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పని చేస్తున్న వారందరిని వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన వారికి వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్, ప్రమోషన్స్ ఇవ్వాలని, డీఏ రికవరీని నిలిపి డీఏతో కూడిన వేతనం అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు దశలవారిగా చేపట్టబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

94 మంది విద్యార్థులకు కండ్లకలక


విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ఏపీ బాలయోగి గురుకుల కళాశాలలో 94 మంది విద్యార్థులకు కండ్లకలకతో బాధపడుతున్నారు. కళాశాల, పాఠశాల పరిధిలో 550 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారిలో సోమవారం నాటికి 30 మందికి కండ్లకలక వ్యాధి సోకింది. స్థానిక వైద్యాధికారి పీపీ ప్రియాంక కళాశాల విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు చేసి 94 మందికి వ్యాధి సోకినట్లు గుర్తించారు. వ్యాధి సోకిన విద్యార్థులను ప్రత్యేక గదిలో ఉంచారు. ఒక విద్యార్థినిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పాఠశాలలో మూడు రోజులపాటు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఒకేసారి ఎక్కువ మందికి కండ్లకలక రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో కండ్లకలక అధికంగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు

- సమయం, ఖర్చు ఆదా.. దిగుబడి రెట్టింపు
- కూలీల కొరతకు చెక్
- కలుపు నివారణ సులభం


డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న రైతు

పాలకొండ రూరల్: ఇటీవల కాలంలో వ్యవసాయంలో ఆధునిక యంత్రపరికరాల వినియోగం పెరిగింది. కూలీల కొరతను అధిగమించడంతో పాటు సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుండడంతో యంత్రాల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ఆర్‌బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయ యంత్రపరికరాలను అందిస్తూ ఆధునిక సాగు పద్ధతులు అనుసరించేలా రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో డ్రమ్‌సీడర్ సాయంతో నాట్లు వేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. డ్రమ్‌సీడర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

డ్రమ్‌సీడర్ వినియోగం ఇలా..

వరి సేద్యానికి 15 రోజుల ముందుగా దమ్ము చేపట్టి పొలం సిద్ధం చేయాలి. విత్తనాలు వేసేందుకు నాలుగు రోజుల ముందు మరోమారు దమ్ము చేపట్టి నీరు నిలువ లేకుండా చూడాలి. పొలాన్ని సమానంగా చదును చేసుకోవాలి. బురద పదునులో రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంలో కాలువలు చేయాలి. ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను 24 గంటలు నీటిలో నానబెట్టిన తరువాత మరో 24 గంటలు గోనె సంచిలో ఉంచాలి. ఎకరానికి విత్తన రకాన్ని బట్టి 12 నుంచి 16 కిలోల విత్తనాలు సిద్ధం చేసుకోవాలి. మొలకెత్తిన విత్తనాన్ని పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా డ్రమ్ సీడర్ పరికరంలో వేసి విత్తుకోవాలి. మొక్కలు మొదటి ఆకు పూర్తి పురివిచ్చుకునే వరకు (7 నుంచి 10 రోజులు) ఆరుతడులు అందించాల్సి ఉంటుంది.

కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం

ఈ విధానంలో కలుపు నివారణ కోసం విత్తిన 8 నుంచి 10 రోజుల్లో ఎకరానికి 25 కేజీల ఇసుక వంతున సిద్ధం చేసి అందులో బుటాక్లోర్, సేఫనర్స్ 1.25 మిల్లీ లీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రాములు కలిపి పొలమంతా పలుచటి పొరలా చల్లాల్సి ఉంటుంది. మొలకెత్తిన 20 నుంచి 25 రోజులకు కలుపు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల ఫెర్నాక్సోన్(డిసోడియం లవణం) వార్షిక గడ్డి కలుపు మొక్కల నివారణకు వాడుకోవాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు 400 మిల్లీలీటర్లు సైథాలో పాప్‌బ్యూటైల్ మందును నీటిలో కలిపి కలుపు మొక్కలపై పిచకారి చేయాలి. వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేసి కలియదున్నాలి. మిగిలిన ఎరువులు చివరి దశలో వేసుకుంటే మేలు. అలాగే అధికారుల సూచనల మేరకు నత్రజని మూడు సమ భాగాలుగా చేసి విత్తిన 15–35–60 రోజుల వ్యవధిలో బురదనీరు పూర్తిగా తీసివేసిన తరువాత వేయాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు..

తక్కువ ఖర్చుతో..



డ్రమ్ సీడర్ విధానం రైతులకు ఎంతో మేలు చేకూర్చుతుంది. తక్కువ పెట్టుబడి, నీటితో పంట సేద్యానికి తోడ్పడుతుంది. చీడపీడల నుంచి చేనుకు రక్షణ కలుగుతుంది. కాలి బాటలు వలన రైతుకు బహుళ ప్రయోజనం. ఖర్చు, సమయం ఆదా అవడంతో పాటు కూలీల కొరతను అధిగమించవచ్చు.
– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీ, పాలకొండ

డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయడం ద్వారా పైరు వరుస క్రమంలో ఎదుగుదలకు వస్తుంది. పంటకు సూర్యరశ్మి, గాలి పుష్కలంగా అందుతుంది. అలాగే చీడపీడలు బెడద తగ్గుతుంది. సస్యరక్షణకు అయ్యే ఖర్చు కూడా మిగులుతుంది. నారు వేసే పద్ధతితో పోల్చుకుంటే 10 రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది. పెట్టుబడి కూడా 15శాతం వరకు ఆదా అవుతుంది.

గిరిజన హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సీతారాం

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో గిరిజన సంఘ నాయకులు కూరంగి సీతారాం ఆధ్వర్యంలో మండల గిరిజన సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తోందన్నారు. గిరిజన యువతకు ఉద్యోగాలు వచ్చే జీఓ నంబరు 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలో హైడల్ విద్యుత్ ప్రాజెక్టులు మంజూరు చేసి గిరిజనుల ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, అడ్డాకుల రామారావు, కాంతారావు, మెల్లక సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం


సీతంపేట: ఎస్సీవీధిలో నిలిచిపోయిన వర్షపునీరు


వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

భామిని, వీరఘట్టం: మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక ఎండిపోతున్న వరి, పత్తి, తదితర పంటలకు ప్రాణం వచ్చినట్లయింది. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లే ప్రజలతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు.

వీధి కాలువలా..

సీతంపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సీతంపేటలోని ఎస్సీ వీధి జలమయమైంది. వీధిలోని కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో వర్షం నీరు వెళ్లేందుకు మార్గం లేక వీధిలో నిలిచిపోయి పంటకాలువను తలపిస్తోంది. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీతంపేట–పాలకొండ రహదారిపై జగ్గడుగూడ సమీపంలో మంగళవారం సాయంత్రం భారీ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు ట్రాక్టర్ సాయంతో చెట్టును పక్కకు లాగివేయడంతో వాహనాలు ముందుకు కదిలాయి.

వంశధారలో పెరుగుతున్న నీటిమట్టం

భామిని: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వంశధార నదిలో నీటిమట్టం పెరుగుతోంది. దీంతో నదికి అవతల వైపు ఉన్న ఒడిశా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు అధికమైతే నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని, తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: ప్రధాన మంత్రి కౌసల్ వికాస యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలల స్వల్ప వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి పాసైన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. శిక్షణ పూర్తిచేసిన వారికి నైపుణ్యంకు తగ్గ ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలియజేశారు.

ఉత్తమ వలంటీర్‌కు సన్మానం


వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న బాపూజీనాయుడు, తదితరులు

గరుగుబిల్లి: గరుగుబిల్లి గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న రౌతు వినోద్ కుమార్ ఉత్తమ వలంటీర్‌గా ఎంపికవడంతో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ కె.ఇందుమతి, ఎంపీడీఓ జి.పైడితల్లి, తహసీల్దార్ జనార్దన్ తదితరులు అభినందించారు. మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అతన్ని సత్కరించారు. ఉత్తమ సేవలు అందించేవారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా


మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏలో పాలకొండ నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి బీఎల్‌ఓలు ఇంటింట సర్వే చేసి ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దడంతో పాటు మరణించిన వారిపేర్లను తొలగించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ఎటువంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదని సూచించారు. కేవలం బీఎల్‌ఓలు, సంబంధిత సూపర్‌వైజర్లు మాత్రమే సర్వే చేయాలన్నారు. వలంటీర్లు, ఎన్జీఓలు, ఇతరుల ప్రమేయం ఉండరాదని స్పష్టం చేశారు. బీఏల్‌ఓలు సర్వేచేసినపుడు రాజకీయ పార్టీల ఏజెంట్లకు ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే షెడ్యూల్ రెవెన్యూ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. రాజకీయ పార్టీలు చెప్పిన అంశాలను పరిశీలిస్తామన్నారు. బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్న అంశాన్ని పరిశీలించి వాటినికూడా తొలగిస్తామన్నారు. ఏదైనా సమాచారం కోసం కంట్రోల్ రూం నంబర్ 9493083086కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు


వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

సీతంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని దోనుబాయి, కుశిమి పీహెచ్‌సీలు, సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. ఓపీ రికార్డులు, మందుల నిల్వలు, లేబరేటరీ, వార్డులు, ప్రసూతిగదులను పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాధుల వ్యాప్తిపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిషన్ ఇంద్రధనుస్సు (టీకా కార్యక్రమం) సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఎన్ఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లల వైద్యనిపుణుడు వెంకటరావుతో కలిసి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు భానుప్రతాప్, బి.రవీంద్ర తదితరులు ఉన్నారు.

గడువులోగా భూసర్వే పూర్తిచేయాలి

- సబ్ కలెక్టర్ నూరల్ కమర్


గుమ్మలక్ష్మీపురం: పెదఖర్జలో భూముల రీసర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

గుమ్మలక్ష్మీపురం: భూముల సమగ్ర రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండలంలోని పెదఖర్జ గ్రామంలో చేపడుతున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎంతవరకు పూర్తయింది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలో భూయజమానులకు ఏమైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ, సర్వేయర్లు ఉన్నారు.

సర్వే సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూముల సర్వేను రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. పట్టణంలో వీరఘట్టం రహదారిలో చేపడుతున్న భూసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సర్వే చేపట్టే ప్రాంతాలు, సర్వే నంబర్ల వివరాలను ముందు రోజే తెలియజేయడం జరుగుతుందని, ఆ మేరకు రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో పొలాల వద్దకు చేరుకుని సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ పి.వెంకటరావు ఉన్నారు.

వీఎస్ఎస్ భూములకు రక్షణ కల్పించాలి


అటవీశాఖ అధికారికి సమస్యను వివరిస్తున్న వీఎస్ఎస్ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) భూములు అన్యాక్రాంతం కాకుండా అటవీశాఖ ద్వారా రక్షణ కల్పించాలని మండలంలోని జేకేపాడు, ఎస్‌కేపాడు గ్రామాలకు చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు మండంగి రమణ, కద్రక రామకృష్ణ, హుగ్గన్న తదితరులు అటవీశాఖ రేంజర్ పి.ఏడుకొండలును కోరారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురం అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించిన ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్విన్‌పేట బీట్‌లో సుమారు 83.33 హెక్టార్ల అటవీ భూమిలో తోటల పెంపకానికి 1996లో అనుభోగ్యపు హక్కులు పొంది ఉన్నామన్నారు. ఇటీవలా కొంతమంది వ్యక్తుల ప్రోద్బలంతో ఎల్విన్‌పేట వీఎస్ఎస్‌కు ఏ మాత్రం సంబంధంలేని గిరిజనులు ఆ అటవీ భూమిని స్వాధీనపర్చుకునేందుకు పలు రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు దృష్టి సారించి అటవీభూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘జగనన్న సురక్ష’తో ఉచిత సేవలు


భామిని: బురుజోలలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ధర్మారావు, సింహాచలం


పాలకొండ రూరల్: బెజ్జి సచివాలయం వద్ద దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్, ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను సాధ్యమైనంత ఎక్కువ మందికి అందించేందుకు ప్రభుత్వం ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని చేపడుతోందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. గుమ్మలక్ష్మీపురం సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ పాల్గొని అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గరుగుబిల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జియ్యమ్మవలస, సీతంపేట, పాలకొండ, భామిని, వీరఘట్టం మండలాల్లో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు.
– సాక్షి నెట్‌వర్క్


గరుగుబిల్లి: మండల కేంద్రంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, తదితరులు


జియ్యమ్మవలస: గెడ్డతిరువాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


సీతంపేట: జగనన్న సురక్ష కార్యక్రమంలో మంజూరైన సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీ


పుస్తకాల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను మంగళవారం ఎండీయూ వ్యాన్‌ల ద్వారా పంపిణీ చేశారు. మండలంలోని 57 పాఠశాలలకు 10,759 పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎంఈఓలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావులు పర్యవేక్షణలో పుస్తకాలను పాఠశాలలకు చేరవేశారు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచిన మొదటి రోజే పాఠ్యపుస్తకాలను, జేవీకే కిట్లు పంపిణీ చేశారు.